క్లుప్తంగా

సమస్యల పరిష్కారం కోరుతూ హెచ్ఎంల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం జోన్–2 పరిధిలోగల ప్రధాన సభ్యులతో ఆదివారం కాకినాడలో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా పలు అంశాలపై చర్చించారు. సంఘం బలోపేతం చేయడం, సీబీఎస్ఈ పాఠశాలలకు అర్హులైన హెచ్ఎంలను ప్రిన్సిపాల్‌గా నియమించడం, విద్యేతర పనులు తొలగించడం వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జోన్–2 పరిధిలో గల ఉమ్మడి తూర్పుగోదావరితో పాటు, కృష్ణా, పశ్చిమ జిల్లాల సభ్యులు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర సభ్యులు చెవ్వూరి రవి, కోలా సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి దిశగా లయన్స్ సేవలు



వెట్‌గ్రైండర్లు, వీల్‌చైర్ పంపిణీ చేస్తున్న బాదం బాలకృష్ణ తదితరులు

బాలాజీచెరువు: స్వయం ఉపాధి కల్పించే దిశగా లయన్స్‌క్లబ్ సేవలు విస్తృతం చేయాలని జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ కాకినాడ, మైత్రి క్లబ్‌లు సంయుక్తంగా సమకూర్చిన రెండు వెట్ గ్రైండర్లు, వీల్‌చైర్లను పేదలకు ఆదివారం లయన్స్‌హాల్లో అందజేశారు. క్లబ్ కాకినాడ ప్రెసిడెంట్ రామసుబ్రమ్మణ్యం, మైత్రి ప్రెసిడెంట్ శివకుమార్, దంగేటి సతీష్ పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు



దైవసందేశం అందజేస్తున్న ఐజక్

కరప: మండలంలోని గొర్ధటిపాలెం శిలువ సన్నిధిలో చర్చి ఫాదర్ మేడపాటి కృపావరం ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉపవాస ప్రార్థనలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి కాకినాడ జిల్లా పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ జనరల్ సెక్రటరీ డా.శీరం ఐజక్ ముఖ్య అతిథిగా హాజరై ఏసుక్రీస్తు సందేశాన్ని అందజేశారు. సమస్త మానవాళికి శాంతి, సమాధానము చేకూరాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ మేడపాటి రాజకుమార్, దొరబాబు, సవిలే సత్యనారాయణ, పండు యేసేపు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పాస్టర్స్ డే




పాస్టర్ దొరబాబు దంపతులను సత్కరిస్తున్న సంఘ పెద్దలు

కరప: మండల గ్రామాల్లో ప్రపంచ పాస్టర్స్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్దాపురప్పాడు న్యూ సీయోను బాప్టిస్టు చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో చుట్టుపక్కల 10 గ్రామాల్లో క్రైస్తవ బోధనలు చేస్తున్న పాస్టర్ టి.దొరబాబు, మేరీ సుష్మ దంపతులను సంఘ పెద్దలు, సభ్యులు ఘనంగా సత్కరించారు. సంఘ పెద్దలు గుబ్బల రామస్వామి, పీతల చంద్రరావు, ముడే చంద్రశేఖర్, కాలకురచ కృష్ణమూర్తి, బుడితి రామారావు, బక్కి కిషోర్ పాల్గొన్నారు.

పోర్టర్‌కు రూ.వెయ్యి ప్రోత్సాహం

సామర్లకోట: ఒక రైల్వే ప్రయాణికుడి ప్రాణాలు కాపాడిన రైల్వే లైసెన్సు పోర్టర్ వాసు ను అభినందిస్తూ రైల్వే మేనేజరు ఎం.రమేష్ రూ.వెయ్యి నగదు ప్రోత్సాహకం అందజేశారు. జి.వెంకటేశ్వర్లు అనే ప్రయాణికుడు విజయవాడ నుంచి విశాఖపట్టణానికి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తూ గుండె నొప్పితో సామర్లకోట స్టేషన్‌లో దిగి రైల్వే మేనేజర్ రమేష్‌ను వైద్య సాయం కోసం ఆశ్రయించారు. వెంటనే రైల్వే పోర్టర్ వాసును ఇచ్చి స్థానిక ప్రభుత్వాస్పత్రికి పంపారు. ప్రాథమిక వైద్యం అనంతరం 108లో ఆయనను కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లి ఆయన బంధువులకు సమాచారం అందించారు. వారు సత్వరమే వచ్చి ఆయనను అక్కడ నుంచి కార్పొరేట్ ఆస్పత్రికి తరలించి. ఆదివారం వెంకటేశ్వర్లు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంతో డిశ్చార్జి అయ్యారు. ఆయన కుమారుడు ప్రకాష్ పోర్టర్ వాసు సేవలను, రైల్వే అధికారుల తీరును అభినందిస్తూ కృతజ్ఞతగా స్టేషన్ మేనేజర్‌కు లేఖ రాశారు. ఈ మేరకు మేనేజరు రమేష్ వాసుకు ప్రోత్సాహకం అందజేశారు.

ప్రియమైన మీరు.. కుశలమా..



- లేఖా రచనకు పోస్టల్ శాఖ ప్రోత్సాహం
- విద్యార్థులకు అవగాహన కల్పనే లక్ష్యం
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతల ఎంపిక

బాలాజీచెరువు: చాలా కాలం క్రితం పోస్ట్ అనే పిలుపు కోసం ఎదురుచూసిన క్షణాలు గుర్తున్నాయా... అభిమాన లేఖలు.. సమాచారం మోసుకొచ్చిన ఉత్తరాలు.. అందుకుని అపురూపంగా చదువుకుని ఎన్నాళ్లయ్యిందో.. మనసులో భావాలు కాగితంపై పెట్టి అందమైన దస్తూరితో అవతలి వారికి చేరవేయడం ఈ తరానికి తెలీనే తేలీదు. సెల్‌ఫోన్ మేసేజ్, ఈ–మెయిళ్లు, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టా వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం నేటి ట్రెండ్. అందుకే ఉత్తరాన్ని గుర్తు చేద్దామని తపాలాశాఖ తలపెట్టింది. లేఖరులకు పోటీ పెడుతోంది. వీటిపై విద్యార్థులకు అవగాహన కల్గించడానికి తపాలాశాఖ అడుగులు వేస్తోంది.

డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా

ప్రస్తుత డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాధాన్యం తగ్గింది. దూర ప్రాంతాల్లో ఉన్న వారి క్షేమం తెలియజేయాలన్నా, వ్యాపార అవసరాల నిమిత్తం సమాచారం పంపించాలన్నా ఒకప్పుడు పెన్ను, పేపర్ తీసుకుని లేఖలు రాసేవారు. ఇప్పుడా పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ఒకప్పటి సమాచార సాధనాన్ని నేటి తరానికి తెలియజేయడానికి తపాలాశాఖ లేఖ రచన పోటీలకు శ్రీకారం చుట్టింది. డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా అనే అంశంపై లేఖలను ఆహ్వానిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ధయ్ అఖర్ పేరుతో పోటీలు నిర్వహిస్తోంది.

అర్హులు ఎవరంటే..

భారత దేశ పౌరులై ఉండాలి. వయో పరిమితి లేదు.. 18లోపు ఒక కేటగిరి, 18 ఏళ్లు పైబడిన వారిని మరో కేటగిరిగా విభజించారు. తెలుగు, హిందీ, ఆంగ్లం భాషల్లో వ్యాసం రాయవచ్చు. డిజిటల్ విధానంలో పాలన, మౌలిక సదుపాయాలు, అక్షరాస్యత, డిజిటల్ పేమెంట్స్ తదితర అంశాలను పొందుపరచాలి. చేతితో రాసిన వ్యాసం మాత్రమే అనుమతిస్తారు. ఎన్వలాప్ కవర్ అయితే 1000 పదాలు మించకుండా, ఇన్‌లాండ్ లెటర్ అయితే 500 పదాలకు మించకుండా రాయాల్సి ఉంటుంది. ఇలా రాసిన ఉత్తరాలు ది చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ –520013 చిరునామాకు అక్టోబర్ 31వ తేదీలోగా పంపాలి.

బహుమతులు

విభాగాల వారీగా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలను ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి (12మందికి మించకుండా) నగదు బహుమతి అందజేస్తారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు వరుసగా 25 వేలు, 10వేలు, ఐదు వేలు అందజేస్తారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారికి జాతీయ స్థాయికి పంపుతారు. జాతీయ స్థాయిలో విజేతలకు ప్రథమ స్థానం 50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి 25వేలు, తృతీయ స్థానానికి రూ.10వేలు అందజేస్తారు.

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల ఉత్తరాన్ని పరిచయం చేసినట్లవుతుంది. వారిలో పోటీతత్వం పెరుగుతుంది. డిజిటల్ యుగంలో వారి చేతి రాతతో ఉత్తరాలు రాయడం అంటే చాలా మందికి తెలియదు. ఉత్తరాలు రాసే అలవాటు పెరుగుతుంది.

– సురభి శారద, గీతం పాఠశాల ప్రిన్సిపాల్

రాజాట్యాంకు పార్కులోనూ సంగీత విభావరులు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- వాకర్స్ ఆధ్వర్యంలో ఆకట్టుకున్న విభావరి



ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరిస్తున్న వాకర్స్ సంఘం ప్రతినిధులు

కాకినాడ సిటీ: కాకినాడ గాంధీనగర్ పార్కులోని కళావేదిక వద్ద స్వరాభిషేకం అనే సినీ సంగీత విభావరిని స్వరాభిషేకం సింగర్స్‌తో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాల్గొని మాట్లాడుతూ వాకర్స్ ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించారన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రాజాట్యాంకు పార్కులో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పార్కు రాత్రి 9 గంటల వరకు ఉండే విధంగా, పార్కులో ఉన్న సమస్యలు అన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, వెంకట్‌లను సత్కరించారు. పార్కు కార్యదర్శి పి. వీరభద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయి పనులకు శంకుస్థాపన



కుళాయి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

కాకినాడ రూరల్: జగనన్న కాలనీలలో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలం పండూరు లే అవుట్ – 5లో పేదలకు ఇచ్చిన ఇళ్ళ స్థలాలు వద్ద ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ కోసం జల్ జీవన్ మిషన్ నిధులు రూ.81 లక్షలతో చేపట్టనున్న పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో అన్ని కాలనీలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి, జేఈ మారుతీరామ్, ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాస్, నందిపాటి అజయ్, ధర్మారాజు, రాంబాబు, నందిపాటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తరాలుగా మీ ఐక్యత మరువలేనిది

- ఎమ్మెల్యే ద్వారంపూడి



వర్తక సంఘం ప్రతినిధులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ సిటీ: కాకినాడ పట్నాల చిట్టియ్య సెంటర్లో 84వ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బంగారు వెండి, డైమండ్స్ వర్తక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని వర్తక సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం సంఘం సిబ్బంది నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి డ్రాలు నిర్వహించి విజేతలకు మిక్సీ, సైకిల్, గ్రైండర్, వాటర్ కెటిల్, వెండి దేవుని పూజా సామగ్రి, ఎలక్ట్రిక్ కుక్కర్, క్రాంప్టన్ ఫ్యాన్, వాషింగ్ మిషన్, మిక్సీ, గోల్డ్ రింగ్‌లను విజేతలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పట్టణానికి ఎంతో చరిత్ర కలిగిన గోల్డ్ మార్కెట్ సెంటర్ వద్ద ఇన్నేళ్లుగా ఐకమత్యంతో గణపతి నవరాత్రులు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్న సంతర్పణ చేసిన అన్నదాత జీఎస్ బ్రదర్స్ జ్యూయలర్స్ అధినేత గుత్తుల శ్రీనివాస్, కమిటీ చైర్మన్ నెల్లిపూడి ఉదయభాస్కర్, కార్యదర్శి మహాడిక్ శ్రీనివాస్, వర్తక సంఘం అధ్యక్షులు అనిశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షులు బహదూర్‌లను దుశ్శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, గోవిందరాజులు, వర్తక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆపస్ జిల్లా నూతన కార్యవర్గం



ఆపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన చలపతి, శ్రీనివాస్

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కాకినాడ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి సంఘం కోశాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా ఫంక్షన్ హాలులో జరిగిన ఆపస్ జిల్లా మహాసభలో జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడిగా ఎస్ఎస్‌వీ చలపతి, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా కె.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా కేవీ రమణ, కె.చినబాబు, వి.నాగేశ్వరి, కోశాధికారిగా పాలెపు శ్రీనివాస్ ఎన్నికై నట్లు తెలిపారు. వీరితో పాటు 15 మంది జిల్లా కార్యదర్శివర్గం, రాష్ట్ర ప్రతినిధులుగా ఓలేటి వీవీ శాస్త్రి, కె.పద్మజ, ఆచంట సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు. ఈ సమావేశంలో విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయశాస్త్రి, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో భారతీయ శాస్త్రవేత్తల పాత్ర అనే అంశంపై ప్రసంగించారు. మాజీ కార్పొరేటర్ సాలగ్రామ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మాక్ జీ20 సదస్సుకు విద్యార్థుల ఎంపిక



ఎ.దొంతమూరు విద్యార్థులతో నిర్వహించిన మాక్ జీ20 సదస్సు



వివిధ దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు

పిఠాపురం: మండలంలోని పి.దొంతమూరు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నియోజకవర్గస్థాయి మాక్ జీ20 సమావేశం నిర్వహించారు. పలువురు విద్యార్థులు ప్రతిభ చూపి జిల్లాస్థాయి మాక్ జీ20 సదస్సుకు ఎంపికైనట్లు రైజ్ కో ఆర్డినేటర్ ప్రసాద్ ఆదివారం తెలిపారు. పి.దొంతమూరు హైస్కూల్‌కు చెందిన భానుశ్రీ, విజయ, దివ్య, గొల్లప్రోలు మండలం వన్నెపూడి హైస్కూల్‌కు చెందిన అపర్ణ, పిఠాపురం ఏపీఎం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన లక్ష్మీప్రసన్న, జాయ్ దీవెన, పి.వెంకటాపురం గురుకుల పాఠశాలకు చెందిన భావనశ్రీ, హనీ, కొత్తపల్లి మండలం నాగులాపల్లి ఇంగ్లిషు మీడియం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన మధుప్రియ, దుర్గరాజు, పి. తిమ్మాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన లాస్య, కుమారప్రియం హైస్కూల్‌కు చెందిన సంధూజ జిల్లా స్థాయి మాక్ జీ20 సదస్సుకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. వచ్చే వారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఆర్జేడీ నాగమణి, యూనివర్సిటీ ఇంగ్లిషు ప్రొఫెసర్ల సమక్షంలో కలెక్టరేట్‌లో నిర్వహించే మాక్ జీ 20 సదస్సులో వీరు పాల్గొంటారని తెలిపారు.

స్వామినాథన్ సేవలు మరువలేం

- కాకినాడ ఎంపీ వంగా గీత



స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ వంగా గీత

పిఠాపురం: వ్యవసాయ రంగానికి హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ చేసిన సేవలు మరువలేమని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. గొల్లప్రోలులో ఆదివారం స్వచ్ఛ గొల్లప్రోలు, స్వామి వివేకానంద జ్ఞానమందిరం ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రైతుమిత్ర రూరల్ టెక్నాలజీ పార్కు ఫౌండర్, కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ సీఈఓ అద్దాల గోపాలకృష్ణ స్వామినాథన్ సేవలను వివరించారు. కార్యక్రమంలో గొల్లప్రోలు సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల భీముడు, కౌన్సిలర్ గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, స్వచ్ఛ గొల్లప్రోలు, స్వామి వివేకానంద జ్ఞాన మందిరం సభ్యులు పాల్గొన్నారు.

200 మందికి కంటి పరీక్షలు



ఉప్పలంకలో కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న బాలకృష్ణ తదితరులు

కరప: మండలంలోని ఉప్పలంకలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కాకినాడ లయన్స్‌క్లబ్ గోల్డెన్ జూబ్లీ, రావుల వెంకన్న ఫౌండేషన్ (నయన ఐకేర్), బాదం బాలకృష్ణ క్లాత్ అండ్ ఐ గ్లాస్ ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకుని కంటిచూపును సంరక్షించుకోవాలన్నారు. శిబిరానికి వచ్చిన వారికి వైద్యులు కంటి పరీక్షలు చేసి మందులు అందజేశారు. 105 మందికి కళ్లజోళ్లు అవసరమని, త్వరలో వారికి అందజేస్తామన్నారు. 19 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరం కాగా ఉచితంగా చేయించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ గుప్తా, ప్రాజెక్ట్ చైర్మన్ వీవీ రమణ, జేజీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్‌లో భారీ అన్నదానం



వలసపాకల రామాలయంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



సర్పవరం జంక్షన్‌లో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ రాంబాబు, సుభీబాయ్ కుటుంబ సభ్యులు

కాకినాడ రూరల్: వినాయక చవితి వేడుకలు విజయవంతంగా జరగడంతో సర్పవరం జంక్షన్‌లో మహవీర్ జ్యూయలర్స్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఎస్‌బీ డీఎస్పీ రాంబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా రమణయ్యపేట, సర్పవరం, వాకలపూడి, తదితర గ్రామాల నుంచి సుమారు 4వేల మంది హాజరయ్యే హాజరై అన్న ప్రసాదం స్వీకరించారు. నిర్వాహకులు సుభీబాయ్, ఆమె కుమారులు పుటర్‌మల్ జైన్, మహవీర్ జైన్, అంబలాల్ జైన్, మహేంద్రకుమార్ జైన్, కుటుంబ సభ్యులు మరో 12మంది స్వయంగా వడ్డించారు. తమ తండ్రి శాంతిలాల్ ఆశీస్సులతో ఈ కార్యక్రమం తలపెట్టినట్టు వారు తెలిపారు. అలాగే వలసపాకల రామాలయంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొని వడ్డన చేశారు.

ప్రజాస్వామ్యంపై బీజేపీ దాడి

కాకినాడ సిటీ: దేశంలో ప్రజాస్వామ్యంపై బీజేపీ దాడి చేస్తోందని, దానికి టీడీపీ, జనసేన పార్టీలు వంతపాడుతున్నాయని సీపీఎం కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ విమర్శించారు. ఆదివారం సీపీఎం జిల్లా విస్తృత సమావేశం స్థానిక సుందరయ్యభవన్‌లో కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతికా స్వేచ్ఛపై బీజేపీ దాడి పెరిగిపోయిందన్నారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఎవరైనా వార్తలు రాస్తే వారిపైన దాడులు పెరిగిపోతున్నాయన్నారు. న్యూస్ క్లిక్ పైన దాడి చేయడం ఈ కోణంలోదేనన్నారు. కరణం ప్రసాదరావు, జి.బేబీరాణి, టేకుమూడి ఈశ్వరరావు, నీలపాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కొత్తపల్లి: పొన్నాడ శివారు కోనపాపపేటలో సారా బట్టీలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో సారా తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎస్సై స్వామినాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారు చేయడం, విక్రయించడం నేరమన్నారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయించినా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సారాను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు పోలీసులకు సహకరించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొత్తపల్లి: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్లు ఆదివారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని మూలపేట గ్రామానికి చెందిన వాసంశెట్టి ఆనంద్ దుర్గ (30) స్థానికంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌ను జీవనోపాధి పొందుతున్నాడు. తన ఇంటిలో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 5వ తేదీ రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని చికిత్స నిమిత్తం బంధువులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఎస్సై

సామర్లకోట: పోలీసులలో కాఠిన్యమే కాదు.. మానవత్వం ఉంటుందని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు నిరూపించారు. స్థానికంగా బిచ్చమెత్తుకుని జీవించే ఆవుల అంజమ్మ (38) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందింది. విషయం తెలుసుకున్న గరగారావు ఆమె మృతదేహానికి అయోధ్యరామపురం శ్మశాన వాటికలో సొంత ఖర్చులతో దహన సంస్కారాలు చేసి మానవత్వం చాటుకున్నారు. దీంతో స్థానికులు ఆయనను అభినందించారు.